క్లుప్తంగా

జ్యోతి చంద్రమౌళికి కీర్తి పురస్కారం


జ్యోతి చంద్రమౌళి

అద్దంకి రూరల్: అద్దంకికి చెందిన పురావస్తు శాస్త్ర పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి తెలుగు కీర్తి పురస్కారాన్ని, ప్రశంస పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం తెలుగు విశ్వవిద్యాలయంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని ఈ గౌరవం దక్కిందన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నేడు

చీరాల అర్బన్: చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు.. హాజరు కావాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


కొండమూరులో ప్రమాద భరితంగా ట్రాన్స్‌ఫార్మర్‌పై వ్యాపించిన తీగ మొక్కలు

జె.పంగులూరు: కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌లపై పిచ్చి, తీగ మొక్కలు వ్యాపిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్ వైర్లను పూర్తిగా తీగలతో కప్పేయడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. మండల పరిధిలోని కొండమూరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇలా మారింది. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు, తీగలను తొలగించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

వృద్ధులకు అన్నదానం

అద్దంకి రూరల్: శింగరకొండలోని కష్టజీవుల జాతీయ సేవా సంఘం వృద్ధాశ్రమంలోని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన మండలపు భూషమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణ చంద్రరావు, సెక్రటరీ అలహరి ప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, సందరెడ్డి శ్రీనివాసరావు, అంజాద్ బాషా, చిన్ని మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా ఉపయోగించుకోండి

దర్శి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న నిర్వహించే మెగా జాబ్‌మేళాను ఉపయోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పీటీఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాలో మాన్యుఫాక్చరింగ్, మెడికల్–ఫార్మాస్యూటికల్, రిటైల్, టెలీకాలింగ్ వంటి ప్రధాన రంగాల నుంచి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, బీటెక్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

దొనకొండ (కురిచేడు): దొనకొండలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ బి.రమాదేవి, మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ గురువారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్ వాయిస్‌లు తనిఖీ చేశారు. అవసరమైన రైతులకు మాత్రమే యూరియా ఇవ్వాలని, ఇతర ప్రాంతాల వారికి అమ్మవద్దని సూచించారు. ఎంఆర్‌పీకి మించి అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూములు దక్కే వరకూ ఉద్యమిస్తాం

ముండ్లమూరు (దర్శి): కష్టజీవులకు భూములు దక్కే వరకూ ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం కెల్లంపల్లిలో సాగు భూముల సాధన కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్రజెండాలతో భూములు దున్ని, విత్తనాలు చల్లి సాగుకు దిగారు. కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ భూముల్లో హక్కులు దక్కే వరకు, పంటలు చేతికొచ్చే వరకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు, పంటా ఏడుకొండలు పాల్గొన్నారు.

పాహిమాం.. వినాయకా!


మేదరమెట్లలో ఓ గృహంలో ఏర్పాటు చేసిన వినాయక పూజా ఏర్పాట్లు


వేటపాలెం సెంటర్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం


యద్దనపూడి: పూనూరులో గణనాథునికి పూజలు


అమరావారి వీధిలో నవధాన్యాలతో తయారు చేసిన గణపతి


మార్టూరులోని రవీంద్ర బేకరీలో తయారైన శివలింగాకారంలో ఉన్న లడ్డూ

● ఘనంగా వినాయక చవితి

కారంచేడు:

చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. తల్లి రక్షణకు ప్రాణమిచ్చిన మాత్ర వాక్పరిపాలకుడు.. ఆది దేవుడు.. ఏకదంతుడు.. పార్వతీ తనయుడు పలువురు భక్తులు కొనియాడారు. పోలీస్ శాఖ అనుమతులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు మండలంలోని కుంకలమర్రు, స్వర్ణ చినచెరువు, కొత్తపాలెం, నడిగడ్డ, గలాభపేట, దగ్గుబాడు, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, ఆదిపూడి, తిమిడెదపాడు, జరుబులవారిపాలెం, యర్రంవారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామాల్లోని విగ్రహాలను పోటాపోటీగా నెలకొల్పారు.

మేదరమెట్ల: గృహాల్లో మట్టి వినాయకుడికి పూజలు నిర్వహించారు. మండలపాల వద్ద డీజేలతో, మైకులతో గ్రామాలు సందడిగా మారిపోయాయి. జె.పంగులూరు: వినాయ చవితి పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం వినాయక చవితి కన్నుల పండుగగా జరుపుకున్నారు. అనంతరం మండపంలో విగ్రహం ఏర్పాటు చేసుకొని భక్తిశ్రద్ధలతో పూజించారు.

మార్టూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వీట్ షాపుల్లో పలు రకాల ఆకృతులలో తయారైన లడ్డూలు ఆకట్టుకున్నాయి.

యద్దనపూడి: సకల విఘ్నాలు తొలగించే వినాయక చవితి వేడుకలను బుధవారం మండలంలోని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ బొజ్జ గణపయ్యలు శోభాయమానంగా కొలువుతీరాయి.

అద్దంకి: తిమ్మాయపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం అందరినీ అకట్టుకుంది. హైదరాబాబు నుంచి ఈ విగ్రహానికి తెచ్చి ఎస్సీ కాలనీలో ఉంచి పూజలు చేశారు.

వేటపాలెం: గ్రామాల్లో వినాయకుడికి బుధవారం పూజలు నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లో, రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రత్యేక పూజలు చేశారు.


చీరాల టౌన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు రూరల్ గ్రామాల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గౌడ సంఘీయులు ఏర్పాటు చేసిన సింధూర్ గణపతి ఆకర్షిస్తోంది. వాడరేవు సముద్ర తీరంలో గణనాదుల నిమజ్జనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

చినగంజాం: వినాయక చవితి పర్వదినాన్ని మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పెదగంజాం సముద్రంలో నిమజ్జనం చేసేందుకు పల్లెపాలెంలోని తీరానికి తరలించారు.

చీరాల అర్బన్: పట్టణ, పరిసర ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉండ్రాళ్ళు, పాయసం, పత్రితో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అమరావారివీధిలోని శ్రీ గణపతి బాలభక్త సమాజం ఆధ్వర్యంలో వెయ్యి కేజీల నవధాన్యాలతో వినాయక ప్రతిమను తయారు చేశారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని మక్కెనివారిపాలెం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టివినాక విగ్రహం ఏర్పాటు చేశారు.యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

బల్లికురవ: సకల దేవతలకు అధిపతి అయిన గణపతి నిలువెత్తు విగ్రహాలను గ్రామాల్లో పోటాపోటీగా ఏర్పాటు చేశారు. పార్టీ జెండాలు, డీజేలు నృత్యాలు లేకుండా ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు జరిగాయి.


కారంచేడులో 108 బెల్లపు అచ్చులతో స్వామివారికి ప్రత్యేక పూజలు


తమ్మవరంలో వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడు


అద్దంకి వద్ద నిమజ్జనం కోసం వేచి ఉన్న భక్తులు


వాడరేవులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


తిమ్మాయపాలెం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం


నక్కబొక్కల పాడులో పూజలందుకుంటున్న గణనాథుడు


చినగంజాం: వినాయక విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేస్తున్న భక్తులు


రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం


ఈపురుపాలెం పోతురాజు శిల వద్ద ఏర్పాటు చేసిన ఆపరేషన్ సింధూర్ గణపతి

కూటమికి స్మార్ట్ మీటర్ల షాక్ తప్పదు


ప్రతిజ్ఞ చేస్తున్న వామ పక్ష నాయకులు

అద్దంకి: ప్రజలకు ప్రమాదకర విద్యుత్ స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని సీపీఎం నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆగస్టు 28వ ప్రతిజ్ఞ దినాన్ని వామపక్ష పార్టీలు.. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు కేఎల్‌డీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల పైన సర్దుబాటు చార్జీల పేరుతో 15,485 కోట్ల రూపాయలు విద్యుత్ చార్జీల భారం వేశార న్నారు. అధికారంలోకి రాక ముందు ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని పెంచిన చార్జీల్ని తగ్గిస్తామని హామీలను ఇచ్చిన విషయం గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చార్జీలు పెంచిందన్నారు. 2000లో ఇదే రోజున అంటే 25 సంవత్సరాల క్రితం ఉమ్మడి రాష్ట్రం హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు విద్యుత్ సంస్కరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేశారని.. ఆ పోరాటాన్ని అణిచివేయాలనే ప్రయత్నంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బషీరాబాద్ పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు అమరులయ్యారని చెప్పారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఈరోజు విద్యుత్ సంస్కరణ వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకుని మరో స్మార్ట్ మీటర్ల వ్యతిరేక పోరాటాన్ని చేపడతామన్నారు. ఆరోజు తెలుగుదేశం ప్రభుత్వానికి పట్టిన గతి ఈ కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని తెలిపారు. ఈ పోరాటంలో రైతులు వ్యవసాయ కార్మికులు చిన్న వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ విద్యుత్ చార్జీలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి. తిరుపతిరెడ్డి, పి. ఆదాం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఉసురుపాటి శామ్యూల్ ఫ్రూట్ వెండర్స్ నాయకులు తోట వెంకటేశ్వర్లు, ఆటో వర్కర్ యూనియన్ నాయకులు గణేషు, సీపీఎం సభ్యులు ఎస్‌కే కరీం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ స్థాపనకు స్థల వితరణ

మార్టూరు: వైఎస్సార్ సీపీ మార్టూరు మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి గురువారం అంబేడ్కర్ విగ్రహ స్థాపన కోసం రెండు లక్షల రూపాయల విలువైన రెండు సెంట్లు భూమిని విరాళంగా అందజేశారు. మండలంలోని దేగరమూడి గ్రామంలో విగ్రహ స్థాపన కోసం ఎస్సీ నాయకులు మండల కన్వీనర్ జంపని వీరయ్యను సంప్రదించారు. ఈ క్రమంలో ఆయన స్వగ్రామం దేగరమూడిలోని జగనన్న కాలనీ పక్కన గల తమ సొంత భూమిని అప్పగించారు. జంపని వీరయ్య చౌదరి, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. పులిపాటి సుబ్బారావు, బోసు బాబు, రోశయ్య, భరత్ కుమార్, జెట్టి ఖాజావలి, ధారా రామారావు పాల్గొన్నారు.


దేగరమూడిలో విగ్రహ స్థాపనకు భూమి పూజ చేసిన నాయకులు

వర్గీకరణ బిల్లు వెనక్కు తీసుకోండి


మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

మార్టూరు: మాల జాతికి తీరని నష్టం కలిగించే ఎస్సీ వర్గీకరణ బిల్లును రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లి బిల్లి అశోక్ బాబు హెచ్చరించారు. మార్టూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణా యాత్ర సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వలన సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని మాలలంతా ఐక్యంగా పోరాడటం ద్వారా తగు న్యాయం సాధించుకుందామని పిలుపునిచ్చారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ రాష్ట్రంలో 42 లక్షల మంది మాలలున్నారని వర్గీకరణతో వారికి నష్టం జరిగిందన్నారు. శ్రీనివాసరావు, క్రాంతి, శ్రీదేవి, గేరా స్వరాజ్, మైలా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

అద్దంకి: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దానిలో భాగంగా పట్టణంలోని శింగరకొండ రోడ్డులోని హిట్‌జోన్ ఇండోర్ క్రీడా కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.1 కోటితో నిర్మించనున్న జార్లపాలెం నుంచి చెరువుకొమ్ముపాలెం వరకు నిర్మించనున్న తారు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా అంతర్గత రహదారులు, డ్రైన్లను.. అద్దంకి–కొణికిరోడ్డు నుంచి దాసుల కాలనీ వరకు సీసీ రోడ్డును ప్రారంభించారు. పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వెలిగిన జాతీయ రహదారి ఫ్లడ్ లైట్లు


ఫ్లడ్ లైట్లకు మరమ్మతులు చేస్తున్న హైవే సిబ్బంది


ఫ్లడ్ లైట్లు వెలిగిన అనంతరం స్తంభం

సాక్షి ఎఫెక్ట్..

చినగంజాం: వెలగని లైట్లు తప్పని ఇక్కట్లు శీర్షికతో సాక్షిలో ఈ నెల 26న ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. జాతీయ రహదారి 216కి సంబంధించి చినగంజాం టీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు గత కొంతకాలంగా వెలగడంలేదు. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను సాక్షి దినపత్రిక వెలుగులోనికి చీసుకొని వచ్చి హైవే ఫ్లడ్ లైట్లు వెలిగేది ఎప్పటికో? అలంకార ప్రాయంగా మారిన ఫ్లడ్‌లైట్లు.. అంటూ జాతీయ రహదారి అధికారులు, నిర్వాహకులు దృష్టికి తీసుకొని రావడంతో వారు స్పందించారు. హైవేపై స్తంభానికి వేలాడదీసిన లైట్లు స్థానంలో కొత్త వాటిని వినాయక చవితి రోజు.. సెలవు అయినప్పటికీ సిబ్బంది బిగించారు. చినగంజాం టీ జంక్షన్ వద్ద ఫ్లడ్ లైట్ల కాంతి రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సాక్షి దినపత్రికకు ధన్యవాదులు తెలిపారు.

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

● వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

దర్శి: మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబే..అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని చెర్వుకొమ్ము పాలెం, తూర్పు వీరాయపాలెం, బొట్లపాలెం, పాతకమూరు, పాపిరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు, ఎన్నికలు అయిపోయిన తర్వాత అమలు చేయకుండా చేస్తున్న మోసాలను బట్టబయలు చేస్తూ క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డులతో గ్రామంలో ప్రజలకు వివరించారు. గ్రామాల్లో చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 143 హామీలు ఇచ్చి సీఎం అయ్యాక ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా నిస్సిగ్గుగా అదిచేస్తాం.. ఇది చేస్తాం..అంటూ కల్లబొల్లి మాటలు చెప్పున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించి రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడం, ఆస్తులు ధ్వంసం చేయడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి అప్పులు సృష్టించే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు. దేశంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో మొదటి స్థానంలో సీఎం చంద్రబాబే ఉన్నారన్నారు. పాలన అంటే మాట తప్పని మడమ తిప్పని నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. కుమ్మిత అంజిరెడ్డి, సోము దుర్గారెడ్డి, సర్పంచ్ బొట్ల వెంకయ్య, కౌన్సిలర్ తుళ్లూరి బాబూరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అమీన్‌బాషా పాల్గొన్నారు.